## విశాలాక్షి మాసపత్రిక & మక్కెన రామసుబ్బయ్య స్మారక కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# ఒక్కమాట

వరుసగా రెండో శస్త్రచికిత్స పూర్తి చేసి సహాయకులకు సూచనలిచ్చాను. చాలా అలసటగా ఉంది. హాస్పిటల్లోని నా గదిలోకి నడిచాను.

నర్సు గ్రీన్ టీ తెచ్చిచ్చింది. ప్రాణం లేచొచ్చింది.

చటుక్కున అమ్మ గుర్తొచ్చింది.

తనూ ఇంతే. బడి నుంచో, ఆటలాడో, అలసిపోయి ఇంటికి వస్తే ఇన్ని మంచి నీళ్ళిచ్చేది. తినడానికేదో పెట్టి చెంగుతో నా ముఖం తుడిచేది. అసలు అమ్మ ముఖంలో మొలిచే నవ్వే వెయ్యి ఏనుగుల బలాన్ని, ఆకాశమంత ఆనందాన్ని ఇస్తుంది.

అమ్మని చూసి మాట్లాడి చాన్నాళ్ళయ్యింది. ఒకసారి తీరిక చేసుకుని మా ఊరు వెళ్ళాలి. అమ్మతోడిదే లోకంగా నాల్రోజులు గడపాలి. బాల్యస్మృతుల్ని నెమరేసుకోవాలి.

అసలు ఇవాళ నేనిలా ఉండటానికి కారణం ముమ్మాటికీ అమ్మే. అమ్మ కష్టమే, పట్టుదలే నన్నింత వాడ్ని చేసింది. నాన్న నా చిన్నప్పుడే పోయినా నన్ను ఒంటి చేత్తో పెంచింది ఎలాంటి లోటూ రానీకుండా కంటికి రెప్పలా సాకింది. నన్ను డాక్టర్ని చేసే వరకూ నిద్రపోతే ఒట్టు. ఎలాగైనా అమ్మ అమ్మే. బిడ్డల క్షేమమే అమ్మల బతుకు లక్ష్యం అనిపిస్తూంటుంది ఒక్కోసారి!

సెల్ మోగింది. "ఎన్నింటికొస్తున్నారు?" నా శ్రీమతి డా. సుమలత ప్రశ్నలో అధికార ఛాయ!

"బయల్దేరుతున్నా..."

"రోగుల్తో బాతాఖానీ వేసుక్కూర్చోకండి..."

తనూ డాక్టరే. అయినా నేనెక్కువసేపు రోగుల్తో మాట్లాడి కాలం వృథా చేస్తుంటానని తన అపోహ. కాలమంటే డబ్బు అని గుర్తు చేస్తుంటుంది.

చిన్నగా నవ్వుకున్నాను. నేను ఆపరేషన్ చేసిన రోగికి స్పృహ వచ్చిందని చెప్పారు. ఆ మాట కోసమే ఎదురు చూస్తున్నాను. గభాల్న ఐసియులో కెళ్ళాను.

"ఎలా ఉన్నారు? ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ లేవు కదా?" అడిగానతణ్ణి.

తల అడ్డంగా ఊపాడు. చేతులు జోడించాడు. "మీరు దేవుడు..." అతడి

కళ్ళనుండి జాలువారుతున్న కృతజ్ఞత!

"మీకేం భయం లేదు. అంతా సరి చేశాను. ఇంకో పదేళ్ళదాకా మీ గుండెకి ఢోకా ఉండదు..." భుజం తట్టి భరోసా ఇచ్చాను.

ఇవాళ్టికి పని పూర్తయినట్టే. కారుని బయటికి తీస్తూ యథాలాపంగా వాచీ వంక చూశాను. రాత్రి పదిన్నర. ఎంత లేదన్నా ఇంటికెళ్ళడానికి 40 నిమిషాలు పడుతుంది. ఏమిటో, జీవితమంతా పరుగు పందెం అయిపోయింది. హాస్పటల్, క్లినిక్, సంపాదన తప్ప మరో లోకం లేకుండా పోయింది!

నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

ఇంట్లో అడుగు పెడుతోంటే అంది సుమలత. "మీ అమ్మగారు రెండుసార్లు ఫోన్ జేశారు"

అమ్మ ఎప్పుడు చేసినా ఇంటికే చేస్తుంది. ఆసుపత్రిలో ఉన్నప్పుడు చేసి నన్ను ఇబ్బంది పెట్టడం తనకిష్టం ఉండదు.

"ఎందుకుట?"

"ఏదో మాట్లాడాలిట..."

"దేని గురించబ్బా?"

"ఇంకేమున్నాయి మాట్లాట్టానికి?! మీ ఆహారం గురించీ, ఆరోగ్యం గురించీ అయ్యుంటుంది" సన్నగా నవ్వింది.

"వాటిని అశ్రద్ధ చేస్తూంటానని అమ్మ బెంగ. ఈ వృత్తి వేటలో అవన్నీ చూసుకునే తీరికెక్కడిదీ! అయినా ఒకసారి ఊరెళ్ళి రావాలి. అమ్మ పక్కన కూర్చుని కమ్మని కబుర్లు చెప్పుకుని రావాలి. నాకూ ఆటవిడుపుగా ఉంటుంది. రీచార్జ్ అవుతాను. ఆ ముక్క అమ్మతో చెబుతానుండు, చాలా సంతోషిస్తుంది..."

సెల్ చేతిలోకి తీసుకొంటోంటే వారించింది సుమలత. "ఈపాటికి గాఢ నిద్రలో ఉంటారు. ఏడింటికే మంచమెక్కేస్తారుగా!"

"పల్లెల్లో అంతే. తొందరగా నిద్రపోతారు, తొందరగా లేస్తారు..."

"మనం దానికి పూర్తి భిన్నం. ఆలస్యంగా నిద్రపోతాం, ఆలస్యంగా లేస్తాం..."

"శస్త్రచికిత్సలతో బిజీగా ఉంటున్నానని అమ్మకి చెప్పకపోయావా, ఎంతో సంతోషించేది"

"బోల్డు మందికి ప్రాణదానం చేస్తున్నారని కూడా చెప్పాను..."

తలాడిస్తూ అన్నాను "అది నిజమే కదా మరి"

"అవునవును. కార్పొరేట్ ఆసుపత్రి వాళ్ళు మనకు లక్షల జీతం, ఆపరేషన్ చార్జీల్లో వాటా ఇస్తున్నందుకు నెలనెలా కోటా పూర్తి చేయాలని చెప్పలేదు. నెలకి కనీసం 3 లక్షల విలువ చేసే టెస్టులు రాయాలనీ, 20 మందినైనా శస్త్రచికిత్సకు సిద్ధం చెయ్యాలనీ

చెప్పలేదు. అవసరం లేకపోయినా 'అమ్మో – అత్యవసరం' అని భయపెట్టి ఆపరేషన్ బల్ల ఎక్కిస్తామనీ చెప్పలేదు..." కించిత్తు వ్యంగ్యాన్ని రంగరించి అంది.

"నీకు తెలీందేముంది. తల్లి పాలు తప్పించి, ఆహారం, విద్య, వైద్యం, వినోదం ప్రతీదీ వ్యాపార వస్తువై పోయిందోయ్" చిన్నగా నవ్వాను.

"కానది మన వ్యాపారం కాదు. ఎవరో వ్యాపారానికి మనం చెమటోడ్చి, కోట్లు ఆర్జించి, దోసిళ్ళతో అందిస్తున్నాం!" ఉక్రోష పడింది.

ఇద్దరం చెరో కార్పొరేట్ ఆసుపత్రిలో పని చేస్తూనే సొంతంగా క్లినిక్స్ నిర్వహిస్తున్నాం. కాని ఒక కార్పొరేట్ ఆసుపత్రి ప్రారంభించాలన్నది ఆమె ఆలోచన, కల!

"స్వంత ఆసుపత్రి అయితే మనమూ వాళ్ళలా ఫక్తు వ్యాపారులమైపోతాం!"

"అవనీండి. ఏ రాయి అయినా ఒకటే అయినప్పుడు, ఆ రాళ్ళతో పునాదులు నిర్మించుకోవడం తెలివైన పని. త్వరగా స్నానం చేసి రండి. మీతో ఒక ఇంపార్టెంట్ విషయం డిస్కస్ చేయాలి"

ఆమె వంక సాలోచనగా చూసి స్నానాని కెళ్ళాను.

పుల్కాలు తింటోంటే అంది సుమలత, "డాక్టర్ భాస్కరావు ఒక ప్రతిపాదన తెచ్చారు..."

కళ్ళెగరేసి చూశాను.

"వారి కార్పొరేట్ ఆసుపత్రి బ్రాంచిని గచ్చిబౌలిలో ప్రారంభిస్తున్నారు. కార్డియాలజిస్టుగా మీరు, గైనకాలజిస్టుగా నేను ఎంతో పేరు తెచ్చుకున్నాం. అంచేత మనం ఆ ఆసుపత్రిని నిర్వహిస్తామంటే 25% వాటా ఇస్తామంటున్నారు...."

"మొత్తం ఎంత అవుతుందిట?!"

"ఇరవై కోట్లు... త్వరలో పబ్లిక్ ఇష్యూకి వెళతారట..."

"గుడ్. వాళ్ళు అదో రకం మనుషులు. వాళ్ళ క్రింద పని చేయగలమా?!"

"ఈ బ్రాంచిని పూర్తిగా మనమే చూస్తాం. నిర్వహణ, యాజమాన్యం అంతా మనదే. వాళ్ళు పై వ్యవహారాలు, ప్రచారం చక్కబెడతారు. మీకు తెలుసుగా, వాళ్ళకి ఇదిగాక ఇంకో 4 బ్రాంచిలున్నాయి. విజయవాడ, విశాఖలోనూ ప్రారంభించాలని చూస్తున్నారు"

"నీకేమనిపిస్తోంది?"

"వెంటనే ఒప్పుకోవడం మంచిది. గుడ్ ఆఫర్. గచ్చిబౌలి ఎలాంటి ఏరియాయో నీకు తెలుసుగా. మనమ్మాయి మెడిసిన్ మూడో సంవత్సరంలో ఉంది. అబ్బాయినీ ఈ ఏడాది ఏదో మెడికల్ కాలేజీలో చేర్చేస్తాం. వాళ్ళు డాక్టర్లుగా వచ్చేసరికి ఆసుపత్రిని మనం పూర్తిగా కైవసం చేసుకోవచ్చు..."

"సాధ్యమేనంటావా?"

"అసాధ్యం మాత్రం కాదు. పల్లెలో పుట్టి పెరిగిన మీ అమ్మగారే మిమ్మల్ని ఒంటి చేత్తో డాక్టర్ని చేసింది. మనం మన పిల్లల్ని డాక్టర్లు చెయ్యడంలో గొప్పేమీ లేదు. వాళ్ళకో కార్పొరేట్ ఆసుపత్రిని కట్టబెడితేనే మన గొప్పా, ఘనతానూ. ఇంతకీ డాక్టర్ భాస్కర్రావు ప్రపోజల్ గురించి మీ అభిప్రాయం ఏమిటో చెప్పలేదు"

"మంచి ఆఫరే గాని సగం వాటా ఇస్తే బావుణ్ణు..."

"అడిగి చూద్దాం"

"మాట్లాడైతే"

"మీరూ ఉంటే బావుంటుంది... ఇది పెద్ద వ్యవహారం. మనకి గొప్ప టర్నింగ్ పాయింట్ అవుతుంది" ఆమె కళ్ళల్లో మెరుపు!

"రేపు కలుస్తామని చెప్పు..."

ఆమె మోము పున్నమి సంద్రమైంది. "మూడేళ్ళలో మన పెట్టుబడి తిరిగొచ్చెయ్యాలి. అది మీ మీదే అధికంగా ఆధారపడి ఉంది..."

"ప్రతీ వారికీ వైద్య బీమాలుంటున్నాయిలే. ఇవాళ రేపు ఎవరూ డబ్బుకోసం చూసుకోవట్లేదు. రోగం నయమైతే చాలనుకుంటున్నారు. ఆ అవకాశాల్నీ, రోగుల భయాల్నీ ఈజీగా డబ్బు చేసుకోవచ్చు" తల పంకిస్తూ అన్నాను.

"మీరు నాకు నచ్చారు..." గబుక్కున లేచొచ్చి నా మెడ చుట్టూ చేతులేసి, నా మీదకు వంగి బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది.

"ఇవాళ చాలా తీయగా ఉంది..."

"నా స్వప్నం సత్యమవబోతోందిగా!" కనురెప్పలార్పుతూ నవ్వింది.

"రేపు ఉదయమే గుర్తు చెయ్యి. అమ్మతో మాట్లాడతాను"

"ఇప్పుడే ఈ వార్త ఆవిడకి చెప్పొద్దు"

ఎందుకని అడగలేదు. తలాడించి వూరుకున్నాను.

ఒక్కసారిగా అమ్మ ఆలోచనలు నన్ను చిత్రంగా ముంచెత్తాయి.

ఎంబిబిఎస్‌లో సీటు వచ్చినప్పుడు అమ్మ ఎంత పొంగిపోయిందో వర్ణించలేను. ఆమె కాళ్ళు నేల మీద ఆనలేదు. ఊళ్ళోని అందరి ఇళ్ళకూ పనిగట్టుకుని వెళ్ళి మరీ చెప్పి వచ్చింది.

"నా బిడ్డ డాక్టరవుతున్నాడు. మీకెవరికి ఏ జబ్బు వచ్చినా చిటికెలో నయం చేసేస్తాడు. కుదిరితే మన ఊళ్ళోనే ఆసుపత్రి పెడతాడు. మన చుట్టు పక్కలి గ్రామాల్లోని ఎవరూ కూడా వైద్య సదుపాయం లేదని చింతించక్కర్లేదు. ఇబ్బందులు పడక్కర్లేదు. మనందరికీ నా బిడ్డ దేవుడల్లే గొడుగు పట్టి నిలుస్తాడు" అని అడిగిన వారికీ, అడగని వారికీ గొప్పగా చెప్పింది.

ఊరి వారి ఆనందాన్నీ అభినందనల్నీ పూసగుచ్చి మరీ నాకు చెప్పింది.

"అంతా నిన్ను నారాయణగా కాదు నారాయణుడిగా చూసే శుభదినం కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తానురా" అనీ అంది.

మొదట్లో నా ఆలోచనలూ అలాగే నేల మీదే పాకుతుండేవి. ఎమ్మెస్‌లో చేరాక అవి పూర్తిగా మారిపోయాయి. రంగులద్దుకున్నాయి. రెక్కలూ తొడుక్కున్నాయి. డాక్టర్ సుమలతతో పరిచయమే ఓ పెద్ద కుదుపు. మలుపు. ఇక ఆమె నాన్నతో పరిచయం ఏర్పడ్డాక ఆకాశంలో ఎగరటం మొదలయ్యింది.

ఆమె నాన్నా డాక్టరే. ఆయనకి 20 పడకల నర్సింగ్ హోం ఉండేది. అప్పట్లో అది అంతంత మాత్రంగానే నడిచేది. ఆయనకి నేనూ, నా చదువూ నచ్చాయి. అల్లుడ్ని చేసుకుంటానన్నారు. కాదనడానికి కారణం కన్పించలేదు. అమ్మ అయితే ఏనుగు అంబారీ ఎక్కేసింది. "మా కోడలూ డాక్టరే. ఇక ఊళ్ళో పురుటి చావులు ఉండనే ఉండవు" అని బోలెడు సంబరపడింది!

ఆయన ఆసుపత్రిలోని పాత పద్ధతులూ, పరికరాలూ చూసి పెదవి విరిచాను. మార్చెయ్యమని సలహా ఇచ్చాను.

"ఎంత మార్చినా ఎంబీబీఎస్‌లకి ఇంతకంటే రోగులు రారు. అందరి దృష్టీ ఎమ్‌డీల మీదా, ఎమ్మెస్‌ల మీదా ఉంది. కార్పొరేట్ సంస్కృతి వైద్యంలోనూ మెల్లగా ప్రవేశించింది. మీరు దాన్ని ఒంట బట్టించుకోవాలి. అప్పుడే చుక్కలు చూడగలరు" అన్నారు.

అంతటితో ఊరుకోలేదు.

రోగుల అభిమానాన్ని ఎలా చూరగొనాలో, కొత్త రోగాలు, కొత్త మందులు, కొంగొత్త పరికరాలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అంటూ చెప్పి ఎన్ని రకాలుగా డబ్బు చేసుకోవచ్చో కథలుగా ఉపదేశించారు.

మా పెళ్లైన వెంటనే హఠాత్తుగా గుండెపోటు వచ్చి ఆయన చనిపోయారు. లేకపోతే మాదంటూ ఓ ఆసుపత్రి – కార్పొరేట్ స్థాయిది– ఏర్పరచుకోడానికి ఇరవై ఏళ్ళ ఆగాల్సి వచ్చేదే కాదు.

నిట్టూర్చాను.

చిత్రంగా చూసింది సుమలత.

"ఏం గుర్తొచ్చింది?"

"మీ నాన్నగారు..."

ఆమె కళ్ళల్లోంచి నీటి చుక్కలు తొణికాయి. "బ్యాడ్‌లక్... మన దురదృష్టమే. లేకపోతే ఆయన ఇంకో అయిదేళ్ళు బతికి ఉంటే... మనం ఎక్కడికో దూసుకు పోదుం. భారీ ఆసుపత్రిలో భాగస్తులం కాదు, ఏకంగా యజమానులమే అయిపోదుం!"

"బాధ పడొద్దు. మన పిల్లలు అందుకునేసరికి అన్ని ముగ్గులూ పెడదాం.

అన్నీ ప్లేటులో అమర్చి బహుమతిగా ఇద్దాం. మనం వదిలిన చోటునుంచి వాళ్ళు టేకాఫ్ తీసుకోవాలి. కార్పొరేట్ ఆసుపత్రుల అధిపతులై, విదేశీరోగుల్నీ ఆకర్షించే స్థాయికి ఎదగాలి"

"యా... యూ ఆర్ రైట్..."

చాలాకాలం తర్వాత హాయిగా నిద్రపోయాం. మా కలల్నిండా ఇంద్ర ధనుస్సులు పరచుకున్నాయని వేరే చెప్పనక్కర్లేదు.

మర్నాడు పొద్దెక్కాక లేచాను.

సుమలత హాస్టల్లో ఉండి చదువుకుంటోన్న మా అబ్బాయితోనో, అమ్మాయితోనో మాట్లాడుతోంది.

'ఇవాళ ఎలాగైనా అమ్మతో మాట్లాడాలి' అనుకుంటూ బాత్‌రూంలో కెళ్ళాను.

"నందినికి బాగోలేదు. హెడేక్‌తో బాధపడుతోంది..." కలవరపడుతూ చెప్పింది. నందిని మా అమ్మాయి.

ఫోన్ తీసుకుని నందినితో మాట్లాడేక అన్నాను "రాత్రి సినిమా చూసిందట. దాంతో హెడేక్ వచ్చి ఉంటుంది. దానికింత ఇదైపోవడం ఏవిటీ సిల్లీగా!"

"మీకు నవ్వులాటగానే ఉంటుంది. నేను డాక్టర్నే కాదు అమ్మని కూడా అని మర్చిపోకండి. పిల్లల్లో ఎవరికి బాగోకపోయినా తల్లడిల్లిపోతాను. వాళ్ళు నా పేగు తెంచుకుని పుట్టిన బిడ్డలండీ!" ఎమోషనల్ అయ్యింది.

"ఓకే ఓకే, కూల్డౌన్"

"పిల్లలిద్దరూ ఇదే సిటీలోనే చదువుకుంటున్నారు. అయినా మన దగ్గరుంచుకోడానికి వీల్లేకుండా పోయింది" బరస్టయ్యింది.

"మనం బిజీ అనే కదా వాళ్ళని హాస్టల్లో చేర్చిందీ. అక్కడి కేర్ టేకర్లు మనకంటే ఎక్కువ కేర్ తీసుకుంటారు. అయినా, వాళ్లింకా చిన్న పిల్లలు కాదోయ్, గ్రోన్ అప్..."

"ఇంతప్పట్నుంచీ రెసిడెన్షియల్ స్కూలే కదా!" ఫిర్యాదు చేస్తున్నట్టు అంది.

"అఫ్‌కోర్స్. తప్ప లేదు మరి. గెటప్. క్లినిక్కి టైమవుతోంది"

గబగబా బ్రేక్ ఫాస్ట్ చేస్తోంటే, అమ్మ ఉదయమే ఫోన్ చేసిందనీ, ఏదో మాట్లాడాలంటున్నారనీ చెప్పింది సుమలత.

"ఓహ్ మరిచే పోయాను. మధ్యాహ్నం చేస్తాన్లే..."

"పన్నెండూ రెండు మధ్య పడుకుంటారు. అప్పుడు చెయ్యొద్దు..."

"సరి సరే... పద..."

ఇద్దరం తయారై కార్లో మా క్లినిక్‌కి వెళ్తోంటే అంది "డాక్టర్ భాస్కర్రావు ఒంటి గంటకి రమ్మన్నారు. ఈలోగా గచ్చిబౌలి వెళ్ళి ఆసుపత్రి నిర్మాణాన్నీ, పరిసరాల్నీ ఓసారి చూస్తే మంచిదేమో?"

"పన్నెండింటికల్లా క్లినిక్‌లోంచి బయటపడి ఆ రెండు పనులూ చక్కబెడదాం"

"మరి హాస్పటల్లో కన్సల్టేషన్ సెషన్ ఎగ్గొట్టేస్తారా?"

"రెండింటికి వస్తానని చెబుతాన్లే. ఇక మన ఆసుపత్రి మీదా మన రోగుల మీదా శ్రద్ధ పెట్టాలి"

"మన రోగులు!" నవ్వి అంది. "ఇన్నేళ్లకి మా డాడీ కల నెరవేర్చబోతున్నాం. నాకు మాటల్లో వ్యక్తం చేయలేనంత పరమానందంగా ఉంది"

"యా. నాకూ డిటోయే"

డాక్టర్ భాస్కర్రావుని కలిశాం. ఆయన బృందంతో చర్చించాం. ప్రాజెక్టులో మాకు సగం వాటా ఇవ్వడానికి అంగీకరించారు. వారి నియమ నిబంధనలకు మా అంగీకారం తెలిపాం. మరి రెండ్రోజులు గడవకుండానే రాతకోతలు పూర్తయ్యాయి.

ఆ వెంటనే ఆసుపత్రి నిర్మాణ బాధ్యతలో మేం పాలు పంచుకోసాగాం.

సదరు పనుల ఒత్తిడి వల్ల అమ్మకి ఫోన్ చేయలేకపోయాను. మధ్యలో ఒకసారి ప్రయత్నించాను గాని కలవలేదు.

"మీ అమ్మగారు బయల్దేరి వస్తున్నారుట" ఆసుపత్రిలో కన్సల్టేషన్ చూస్తోంటే ఫోన్లో బాంబు పేల్చింది సుమలత.

"ఇక్కడేమంత ముంచుకు పోతోందనీ!" విసుక్కున్నాను.

"మిమ్మల్ని చూడాలిట. మీతో అత్యవసరమైందేదో మాట్లాడాలిట"

నుదురు చిట్లించాను. "నీతో చెప్పమనకపోయావా?"

"అడిగాను. మీతోనే మాట్లాడతారట. మీకు అమ్మగాని నాకు కాదుగా. నేనెంత బాగా చూసుకున్నా కోడల్నే. పరాయిదాన్నే!" నిష్ఠూరం ధ్వనించిందామె స్వరంలో.

"నాకు ఫోన్ చెయ్యమనాల్సింది. కొత్త ఆసుపత్రి పనుల్లో పడి ఎప్పుడు తింటున్నామో, ఏం తింటున్నామో మనకే తెలీదు. ఊపిరి పీల్చుకోడానికే టైం ఉండట్లేదు. ఇంక బాతాఖానీలకి తీరికెక్కడ! ఎలాగైనా ఆసుపత్రిని దసరాకి ప్రారంభించెయ్యాలి. ప్రారంభోత్సవానికి సినిమా యాక్టర్ని పిలుస్తానంటున్నారు డాక్టర్ భాస్కర్రావు... "

"ఫ్రీ పబ్లిసిటీ వస్తుంది... అయినా, వాళ్ళూ ఊరికే రారులే. చేతులూపుకుంటూ వచ్చి రిబ్బన్ కత్తిరించినందుకు లక్షలు సమర్పించాలి"

"వాళ్ళు తమ పాపులారిటీని క్యాష్ చేసుకుంటున్నారు. తప్పేముంది?"

"అంతా రైటేగాని ఇప్పుడు మీ అమ్మ వస్తే ఎలా భరించడం? ఇద్దరమూ ఇంటి పట్టున ఉండం. పని వాళ్ళ మీద వదల్లేం. ఆమె మెడలోని కాసుల పేరు చూస్తే చాలు ఎవరి బుద్ధికైనా చెదలు పడుతుంది. ఆవిడ దానిని మాత్రం మెడలోంచి తీయరు. సరదాకోసారి నేను వేసుకుంటానన్నా ఇవ్వలేదు. మీ నాన్న కొన్న మొదటి, చివరి నగ అదేనటగా!"

"ఆవిడదో చాదస్తంలే! ఇంతకీ ఎలా వస్తోందిట? కారులోనా?"

"రైలులో అయితే సౌకర్యంగా ఉంటుందిట. రేపు ఉదయమే వెళ్ళి స్టేషన్లో పికప్ చేసుకోవాలి. రేపంతా మీ అమ్మతో కబుర్లేసుకుని కూర్చుంటారు కాబోలు!" సన్నగా నవ్వింది.

"ఇక్కడ కొంపలేవో మునిగిపోతున్నట్టు ఇంతర్జంటుగా ఎందుకు రావటం?" వికారంగా ముఖం పెట్టుకుని విసుగ్గా అన్నాను.

ఈ టైంలో అమ్మరాక నాకు బొత్తిగా నచ్చలేదు. పల్లెలో ఆసుపత్రి పెట్టకుండా హైదరాబాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్నందుకే ఎంతో బాధపడిపోతోంది. ఇక కోట్లు పోసి ఇక్కడ ఆసుపత్రి నిర్మిస్తున్నామంటే భరించగలదా?

"మీ ఊరి వారెవరికో ఆపరేషన్ చేశారుగా. దాని గురించేమైనా అడగాలనుకుంటున్నారేమోనని నా అనుమానం"

గుండె ఝల్లుమంది. నిటారుగా అయ్యాను.

నెలరోజుల క్రితం మా ఊర్నించి సోమయ్య వచ్చాడు. అతడు నాకూ తెలుసు. అయినా మా అమ్మ చేత రెండు ముక్కలు రాయించుకుని నన్ను వెదుక్కుంటూ వచ్చాడు. అతడికి నడుస్తోంటే బాగా ఆయాసం వస్తోందని చెప్పాడు.

అన్ని పరీక్షలూ చేయించాను. చిన్న ఆపరేషన్ చేసి స్టెంటు వేస్తే సరిపోతుంది. కానతడికి 'ఆరోగ్యశ్రీ' ఉంది. డబ్బూ ఉంది. అందుకని ఎంతో మంచిదని చెప్పి బైపాస్ సర్జరీకి సిద్ధం చేశాను. ప్రభుత్వం ఇచ్చేదిగాక అదనంగా లక్ష వసూలు చేశా. అతడు చచ్చి బతికేనని సంతోషిస్తూ వెళ్ళిపోయాడు.

ఒకవేళ టెస్ట్ రిపోర్టులు ఇంకే డాక్టరైనా చూసి, అనవసరంగా సర్జరీ చేశానని చెప్పేరేమో? అతడా మాట మా అమ్మ ముందు కక్కేశాడేమో? కొంపతీసి దాని గురించి అడగటానికో, నన్ను కడిగెయ్యడానికో రావట్లేదు కదా?

అమ్మ నా ఎదుటికొచ్చి ఎడాపెడా చెంపలు వాయించినట్టు తుళ్ళిపడ్డాను.

పని మీద శ్రద్ధ పెట్టలేకపోయాను. నిరీక్షిస్తోన్న రోగుల్ని గబగబా చూసి పంపేశాను. అదృష్టవశాత్తూ ఇవాళ శస్త్రచికిత్సలేమీ లేవు.

తిన్నగా గచ్చిబౌలి వెళ్ళాను. ఆసుపత్రి పనులు వేగంగానే జరుగుతున్నాయి. చిన్న లోపానికి సూపర్వైజర్ మీద విరుచుకు పడ్డాను. అతడు ఘ్రాన్పడిపోయాడు.

మరి కొన్ని పనులు మర్నాటికల్లా పూర్తవ్వాలని గట్టిగా అరుస్తూ చెప్పేను. చిత్రంగా నాకు తెలీకుండానే నేను మారిపోయాను!

అదేమిటో ఎందుకో అర్థంగాకుండా ఉంది. ఇంటికెళ్ళాను. "అలా ఉన్నారేమిటి? ఆర్యూ ఆల్‌రైట్?" అంటూనే బీపీ ఆపరేటస్ తెచ్చి బీపీ చెక్ చేసింది.

"140/95. దేని గురించైనా టెన్షన్ పడుతున్నారా?"

"లేదే"

"మీ మొహం చూస్తోంటే అలా అన్పించట్లేదు..."

మౌనంగా గదిలోకెళ్లి మంచం మీద పడుకున్నాను. నా వెనుకే వచ్చింది సుమలత. ఏసీ ఆన్ చేసింది.

"రిలాక్స్ డియర్... అన్నీ అంతా మర్చిపో. ఒక్కటి తప్ప. మన కలల ఆసుపత్రి. అత్యాధునిక సౌకర్యాలతో మొదటిరోజు నుండే కాసుల వర్షం కురిపించే మన ఆసుపత్రి. అదొక్కటే సత్యం. అది తప్ప అన్నీ మిథ్యే!"

నా కళ్ళ ముందు బంగారు స్వప్నం ఆవిష్కరింపబడుతోంటే, మహోత్సాహంతో కళ్ళు మూసుకుని 'చూస్తూండి'పోయాను!

ఉదయమే సెల్‌లో అలారం పెట్టుకుని లేచి సికిందరాబాద్ స్టేషన్‌కి వెళ్ళాను. అమ్మ వస్తోన్న రైలు వచ్చి పది నిమిషాలైందిట. గబగబా ప్లాట్‌ఫాం మీదకి పరుగెత్తాను.

ఎక్కడా కన్పించలేదు. కంపార్ట్‌మెంట్లోకి దూసుకెళ్ళాను.

"బామ్మగారూ... బామ్మగారూ..." ఒక కుర్రాడు ఎవర్నో లేపడానికి ప్రయత్నిస్తున్నాడు. అటు వెళ్ళాను.

ఆవిడ మా అమ్మ!

ఆమెను కుదుపుతూ పిలిచాను. బదులు రాలేదు. నాడి చూశాను. బలహీనంగా కొట్టుకొంటోంది. గుండె మీద ప్రెస్ చేశాను. కదలిక లేదు. కార్డియాక్ అరెస్ట్ అయ్యుండాలి...!

ఒక్క క్షణం వృథా చెయ్యలేదు. అంబులెన్స్‌కి ఫోన్ చేశాను.

ఆసుపత్రిలో చేర్చి అత్యవసర వైద్యసేవలన్నీ అందించాం. డా. సుమలత కూడా వచ్చి జత కలిసింది.

ఎందరం ఎంతగా ప్రయత్నించినా అమ్మని రక్షించుకోలేకపోయాం.

నాకు ఊపిరి ఊది, పాలు ఇచ్చి, ఉగ్గుపోసి, ఉంగా ఉంగాలు నేర్పి, పాకించి, చిటికెన వేలు పట్టుకుని చిట్టి పొట్టి అడుగులు వేయించి, నున్నగా తలదువ్వి, బడికి పంపించి, హోంవర్కు చేయించి, చదువు చెప్పించి, చెవి మెలేసి బుద్ధులు చెప్పి, క్షమశిక్షణ నేర్పించి, నన్నింతవాణ్ణి చేసిన అమ్మ... నన్ను చూడాలని, నాతో ఏదో మాట్లాడాలని తపిస్తూ వచ్చిన అమ్మ... తన కోరిక తీర్చుకోకుండానే సెలవు తీసుకుని కనబడని లోకాలకు వెళ్ళిపోయింది!

నిర్జీవంగా కట్టెలా పడి ఉన్న అమ్మ వంక బాధగా చూశాను. వేదనగా చూశాను. ఆమె మెడలోని కాసులపేరు నన్ను వెక్కిరిస్తున్నట్టుగా అన్పించింది.

మనిషిలోంచి చిలుక ఎగిరిపోయే దాకానే ఆశలు ఆరాటాలు ఆస్తులు తాపత్రయాలు! ఆ తర్వాత? అంతా శూన్యత. అనంత ప్రశాంతత!

సుమలత నా భుజం మీద చేయి వేసి అనునయంగా నొక్కింది.

దుఃఖాన్ని తమాయించుకుంటూ ఆసుపత్రి లాంజ్‌లోకి నడిచాను.

అమ్మతో బాటు వచ్చిన యువకుడు నన్ను చూచి లేచి నిలబడ్డాడు.

"నువ్వు..."

"మీ ఇంటి పక్కవాళ్ళ అబ్బాయినండి. తోడుంటానని చెప్పి బామ్మగారు తీసుకొచ్చారు..."

"అసలు రాత్రేమయ్యింది?"

"అర్ధరాత్రి లేచి గుండెల మీదెవరో తన్నుతున్నారని గొడవ పెట్టారండి..."

"అప్పుడే హార్ట్ స్ట్రోక్ వచ్చిందన్నమాట. వెంటనే రైల్వే వారిని అలర్ట్ చేసుండాల్సింది. నీ నెగ్లిజెన్స్ అమ్మ ప్రాణం మీదకి తెచ్చింది తెలుసా?" కటువుగా అన్నాను.

"అత్తయ్యగారేమైనా చెప్పారా?" సుమలత మధ్యలో కల్పించుకుంటూ ఆత్రంగా అడిగింది. ఆమెకి తన సిక్స్త్ సెన్స్ ఏం చెప్పిందో మరి!

"డాక్టర్‌గారికి ఒక మాట చెప్పమన్నారు..." సందేహిస్తూ నా వంక చూశాడు.

"ఏమంది? ఏం చెప్పమంది?" అదుర్దాగా అడిగాను.

"మీ మానసిక ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమన్నారు..."

నా... మానసిక... ఆరోగ్యం?!

మా అమ్మ చెళ్ళు చెళ్ళున నా చెంపలు వాయించినట్టు అనుభూతించాను. చిన్నప్పుడు మిత్రుడి కంపాస్ బాక్స్‌లోంచి రూపాయి బిళ్ళ దొంగలించానని తెలిసినప్పుడు అమ్మ అచ్చం అలాగే చెంపలు పగలగొట్టింది.

అంటే అమ్మ నేను డబ్బు తింటూ, డబ్బే త్రాగుతూ, డబ్బు జబ్బుతో బాధపడుతున్నానని విశ్వసించి ఉంటుందా? మై గాడ్! హఠాత్తుగా నడినెత్తిన పిడుగుల వాన కురిసినట్టు తల్లడిల్లిపోయాను.

కళ్ళ ముందు చదువులు, నీతి పాఠాలు, డాక్టర్స్ ఓత్, స్టెతస్కోప్, లబ్‌డబ్‌మని కొట్టుకుంటున్న గుండెకాయ, శస్త్రచికిత్స సామాగ్రి, అయిదంతస్తుల ఆసుపత్రి, నోట్ల కట్టలు, రోగుల దీన ముఖాలు– అన్నీ నా కళ్ళ ముందు గిర్రున తిరిగాయి.

గుండె డాక్టర్నైనా నా గుండె పగిలి కన్నీటి వరదై నన్ను నిలువునా ముంచెత్తింది.

"అమ్మా!" అన్న ఒకే ఒక్క చిన్న మాట నా గుండె గొంతుకలో సుళ్ళు తిరిగింది.

హోరున, భోరున ఏడుస్తూ మొదలు నరికిన వృక్షంలా కూలబడ్డాను!

* * *

**(విశాలాక్షి ఆగస్టు –2017)**